సాక్షి
ఖమ్మం
బుధవారం । 1 । జనవరి । 2025



ఖమ్మం బ్యాంకు కాలనీలో కేక్ కట్ చేస్తూ చిన్నారుల కేరింతలు



న్యూస్‌రీల్

ఏసీపీ రమణమూర్తికి మహోన్నత సేవాపతకం

అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్‌కు సేవాపతకం



రమణమూర్తి, ఏసీపీ



నరేష్‌కుమార్, అడిషనల్ డీసీపీ

ఖమ్మంక్రైం: పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రభుత్వం మంగళవారం పతకాలను ప్రకటించింది. ఇందులో భాగంగా ఖమ్మం ఏసీపీ రమణమూర్తి మహోన్నత సేవా పతకానికి, ఖమ్మం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) నరేష్‌కుమార్ సేవాపతకానికి ఎంపికయ్యారు. ఏసీపీ రమణమూర్తి ఇటీవల కేంద్రప్రభుత్వ అవార్డు సైతం అందుకున్నారు. కాగా, ఖమ్మం సీఎస్‌బీలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ షేక్ సయ్యద్ హుస్సేన్(హెచ్‌సీ 1851) కూడా మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు. అలాగే, ఏఆర్ ఎస్‌ఐలు ఎం.వెంకటేశ్వర్లు జి.రమణమూర్తితో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.హర్షా(1308), బి.వెంకటేశ్వర్లు(హెచ్‌సి904) ఉత్తమ సేవా పతకాలు అందుకోనున్నారు. ఇక ఖమ్మం వన్‌టౌన్ ఎస్‌ఐ ఆర్.నాగేశ్వరరావు, జి.వెంకయ్య(ఏఎస్‌ఐ 1266), ఏఆర్‌లో ఎస్‌ఐ ఎం.డీ.యాకూబ్ షరీఫ్(6252), సీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ ఖలీఖ్(929), సీటీసీ హెడ్‌కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు(1951), ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కె.బ్రహ్మాచారి(2151), టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ జి.హరి(1786), ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు బి.వెంకన్న(1637)తో పాటు టి.వెంకటేశ్వర్లు(2579), బి.శ్రీనివాస్(1616), జి.శంకర్‌రావు(740), సీహెచ్.రవీందర్(1670), ఐటీ కోర్ టీమ్ కానిస్టేబుల్ కురం వాసు(2122) సేవా పతకాలకు ఎంపికయ్యారు. అంతేకాకుండా అగ్నిమాపక శాఖలో వైరా ఫైర్ ఆఫీసర్ ఏ.శ్రీనివాసరావుకు సేవా పతకం ప్రకటించారు.

ఎంఎల్‌హెచ్‌పీ సేవలు అందరికీ అందాలి

ఖమ్మంవైద్యవిభాగం: మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ) సేవలు ప్రతీఒక్కరికి అందేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో గర్భిణులు, చిన్నారులను పరీక్షించడంతో పాటు అన్ని సేవలు, మందుల వివరాల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. అలాగే, డ్రై డే - ఫ్రై డే నిర్వహణ, ఓపీ విధులు, హాజరు నమోదుపై సూచనలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, ఎన్‌సీడీ పీఓ రామారావు, సీహెచ్‌ఐ పీఓ చందూనాయక్ మాట్లాడుతూ తల్లీబిడ్డల క్షేమం, సాధారణ ప్రసవాల పెంపు, మందుల సరఫరా, వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డెమో సాంబశివరెడ్డి, డీపీఓ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే 85శాతం పూర్తి

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల ఆధారంగా చేపట్టిన సర్వే జిల్లాలో 85 శాతం మేర పూర్తయిందని గృహ నిర్మాణ శాఖ ఈఈ బి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కొత్తకొత్తూరు, తిరుమలాపురంలో సర్వేను మంగళవారం పరిశీలించిన ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు ఉంటే ఉమ్మడి కుటుంబంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ జిల్లాలో 3.57 లక్షల ఇళ్లకు 85 శాతం సర్వే పూర్తయిందన్నారు. మిగతా ఇళ్లకు సంబంధించి కొందరు ఆసక్తి చూపకపోగా, ఇంకొన్ని కారణాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ సీ.హెచ్.శివ తదితరులు పాల్గొన్నారు. కాగా, సర్వే సమయాన ఇళ్లలో లేని వారికి మరో అవకాశం కల్పించాలని బీజేపీ మండలల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ వినతిపత్రం అందజేశారు.

వరద బాధితులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదలు ఇళ్లను ముంచెత్తగా సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి కొత్తవి మంజూరయ్యాయి. ఈ మేరకు డూప్లికేట్ సర్టిఫికెట్ల పంపిణీని మంగళవారం ప్రారంభించగా పలువురికి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అందజేశారు. డీఆర్వో రాజేశ్వరి, డీఈఓ సోమశేఖరశర్మ, కార్యాలయ ఉద్యోగి యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆశలతో అడుగులు!

అనేక ఆశలు.. మరెన్నో కలలను కొత్త ఏడాది మోసుకొచ్చింది. పాత సంవత్సరానికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికిన జిల్లా వాసులు అదే స్థాయిలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కష్టనష్టాలను మరిచి భవిష్యత్‌పై భరోసాతో సరికొత్త జీవితాన్ని మలుచుకుంటామని ప్రతిన బూనారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో మిగిలినవి ఈ ఏడాది అమలవుతాయని ప్రకటించడంతో రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత దరిచేరతాయని భావిస్తున్నారు. ఇంకోపక్క నామినేటెడ్ పదవుల పందేరంలో తమకు కలిసొస్తుందని కాంగ్రెస్‌లోని ఆశావహుల్లో ధీమా వ్యక్తమవుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ప్రభుత్వ పథకాల అమలుకు సంక్రాంతి ముహూర్తం

- 'రైతు 'భరోసా'కూ త్వరలోనే శ్రీకారం
- రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరుపేదల ఎదురుచూపులు
- నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాల్లో నిమగ్నమైన ఆశావహులు

ఈ ఏడాదిలోనే కొత్త కార్డులు



గత కొన్నేళ్లుగా రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోగా అర్హులు పథకాలకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యాన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంక్రాంతి తర్వాత కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 48,113 మంది దరఖాస్తు చేసుకోగా.. 8,876 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. కొత్త కార్డుల జారీ, పాత కార్డుల్లో పేర్ల నమోదుకు మంత్రివర్గ ఉపసంఘం విధివిధానాలు ప్రకటించిన నేపథ్యాన త్వరలోనే కసరత్తు మొదలవుతుందని భావిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కార్యాచరణ ప్రారంభించింది. లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటికే దరఖాస్తుల ద్వారా చేపట్టిన సర్వే చివరి దశకు చేరింది. ఇళ్ల కోసం 3,57,869 దరఖాస్తులు అందగా తొలిదఫా నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు కానున్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో మోడల్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. త్వరలోనే లబ్ధిదారుల జాబితా ప్రకటించి.. సంక్రాంతిలోగా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టే అవకాశముంది.

చేయూత కోసం..




చేయూత పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు పింఛన్‌దారులకు నగదు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈనేపథ్యాన నగదు పెంచడంతోపాటు అర్హులైన కొత్త వారికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో అన్ని పింఛన్లు కలిపి 1,58,138 మంది తీసుకుంటుండగా కొత్తగా 14,087 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సాగుకు 'భరోసా'



జిల్లా వ్యాప్తంగా రైతులు రైతుభరోసా కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా 3,42,800 మంది రైతులకు రూ.360.30 కోట్ల మేర రైతుబంధు రూపంలో లబ్ధి జరిగింది. ఎకరానికి ఏటా రూ.10 వేల చొప్పున అందజేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సీజన్లకు కలిపి రూ.15 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకాన్ని కూడా సంక్రాంతి పండుగ కానుకగా మొదలుపెట్టే అవకాశముంది. అలాగే, భూమి లేని నిరుపేదలకు ఏటా రూ.12 వేల సాయం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దీని అమలుకు ఈ ఏడాదే అడుగులు పడతాయన్న ఆశలో అర్హులు ఉన్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ



కొత్త ఏడాది ప్రజలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆశిస్తుండగా.. కాంగ్రెస్ గెలుపునకు కష్టించిన నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురికి కార్పొరేషన్ పదవులు దక్కాయి. ఇంకా ఒకటి, రెండు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవుల తోపాటు జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులపై ఆశావహులు దృష్టి సారించారు. సుడా, మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్లు, దేవాదాయశాఖ కమిటీల్లో పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును ప్రసన్నం చేసుకునే పనిలో ఉండగా ఈ ఏడాది తమ కల నెరవేరుతుందని ఆశిస్తున్నారు.

ఆశలు తీరాలి.. ఆకాంక్షలు నెరవేరాలి..

మంచీచెడులను ఒడిలో నింపుకున్న ఓ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది..
ఎన్నో కలలు, ఆశలు నిండిన కొత్త సంవత్సరం వచ్చేసింది..
గత ఏడాది జరిగిన తప్పొప్పులను సమీక్షించుకుంటూ ఎంచుకున్న లక్ష్యాల సాధనకు పోటీ పడేలా అంతా సిద్ధమవుతున్నారు...

ఈక్రమంలోనే పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతూ జిల్లా అంతటా మంగళవారం రాత్రి సంబురాలు హోరెత్తాయి. చిన్నాపెద్ద, ఊరువాడ తేడా లేకుండా అర్ధరాత్రి 12కాగానే కేక్‌లు కట్ చేయడంతో పాటు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యువత రహదారులపైకి వచ్చి కేరింతలు కొడుతూ కొత్త సంవత్సరాన్ని ఘనంగా స్వాగతించారు. ఇక ఇళ్ల ఎదుట మహిళలు రంగువల్లులను తీర్చిదిద్దడంతో వీధులన్నీ శోభాయమానంగా మారాయి.



సత్తుపల్లిలో సీఐ కిరణ్‌కు కేక్ తినిపిస్తున్న స్థానికులు

ఆదుకునే గుణం భేష్

- పథకాలు అమలుచేస్తూ ముందుకు సాగుతాం
- ఖమ్మంలో వారం రోజుల్లోగా మహిళా మార్ట్
- 'సాక్షి'తో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ముజమ్మిల్‌ఖాన్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'అందరినీ ఒకే కుటుంబంగా భావిస్తూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే గుణం కలిగిన జిల్లావాసులు సుఖసంతోషాలతో ఉండాలి. జిల్లాను వరద ముంచెత్తిన సమయాన ప్రజల్లో సాయపడే గుణాన్ని గుర్తించాం. అదేమాదిరి కొత్త ఏడాదిలోనూ పరస్పరం సహకరించుకుంటూ అందరూ విజయాలు సాధించాలి. గ్రూప్–1, 2 పరీక్షలు రాసిన జిల్లా యువత మంచి ఫలితాలు సాధించాలి.' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకాంక్షించారు. ఇక జిల్లా నుంచి డ్రగ్స్‌ను తరిమికొట్టడం, ప్రభుత్వ పథకాలను అర్హుల దరిచేర్చడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు చెబుతూ 'సాక్షి'కి మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో కలెక్టర్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

ఇళ్ల సర్వే 80 శాతం పూర్తి..

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇందిరమ్మ ఇళ్ల సర్వే 80 శాతం పూర్తవగా, తొలిదశలో సొంత స్థలం ఉన్న వారికి మంజూరు ఉంటుంది. అన్ని జిల్లాల్లో కంటే ముందుగా ఇక్కడ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాలతో ఈ ఏడాది రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందజేస్తాం. రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆస్పత్రులు, ఇంగ్లిష్ బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. జిల్లాలో 34 పాఠశాలల్లో ఇంగ్లిష్ ప్రత్యేక బోధన జరుగుతుండగా, ఈ ఏడాది 200 పాఠశాలల్లో ప్రవేశపెట్టాలన్నది లక్ష్యం.

ఖమ్మం మహిళా మార్ట్

ఎస్‌హెచ్‌జీలు, డ్వాక్రా సంఘాల్లో సభ్యుల స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతాం. జిల్లాలో 4వేలకు పైగా మహిళా సంఘాలకు రుణాలు ఇస్తున్నాం. వారం రోజుల్లోగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కేఎంఎం(ఖమ్మం మహిళా మార్ట్) మొదలవుతుంది. మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన సర్ఫ్, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, బట్టలు, బుట్టలు ఇలా అన్నీ ఇక్కడ అమ్మకానికి ప్రణాళిక రూపొందించాం. 'మేడ్ ఇన్ ఖమ్మం' బ్రాండ్‌తో దశల వారీగా ప్రతీ మున్సిపాలిటీలో ఈ మార్ట్‌లను ఏర్పాటు చేస్తాం.

ప్రత్యేక వైద్యసేవలు

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రతీ శుక్రవారం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక వైద్యసేవలు ఉంటాయి. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల్లోగా సీనియర్ సిటిజన్లకు ఒకేచోట హెల్త్ క్యాంప్ నిర్వహిస్తాం. ఆటో డ్రైవర్లు, ట్రాన్స్‌జెండర్లకు హెల్త్ క్యాంపులు కొనసాగుతున్నాయి.

బుద్ధిస్ట్ సర్క్యూట్ ఏర్పాటుకు కార్యాచరణ

- ఫణిగిరి నుంచి సాగర్ వరకు సర్క్యూట్
- పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములునాయక్



బౌద్ధక్షేత్రం అభివృద్ధి ప్రణాళికలపై చర్చిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: రాష్ట్రంలోని ఫణిగిరి నుంచి నాగార్జునసాగర్ వరకు బుద్ధిస్ట్ సర్క్యూట్ ఏర్పాటుచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని పురారావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములునాయక్ తెలిపారు. నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రాన్ని పురావస్తు, టూరిజం శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించేలా కల్పించాల్సిన సౌకర్యాలు, మ్యూజియం ఇతరత్రా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీడీ రాములునాయక్ మాట్లాడుతూ బౌద్ధక్షేత్రం వద్ద రూ.2.50 కోట్లతో మ్యూజియం ఏర్పాటుచేయడమే కాక ఇతర వసతులు కల్పిస్తామని తెలిపారు. అలాగే, ఫణిగిరి, గాజులబండ, చాడ, నేలకొండపల్లి నుంచి కారుకొండ మీదుగా నాగార్జునసాగర్ వరకు సర్క్యూట్ ఏర్పాటుకు కార్యాచరణ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారి నరసింహారావు, పర్యాటక శాఖ ఎస్‌ఈ సరిత, జిల్లా అధికారి సుమన్‌చక్రవర్తితో పాటు తుంబూరు దయాకర్‌రెడ్డి, రామకృష్ణ, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, బొందయ్య, జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హన్మంతరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, కొడాలి గోవిందరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, కడియాల నరేష్, యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో పార్క్‌ల పరిశీలన

కూసుమంచి: మండలంలోని పాలేరులో పార్క్‌లు, రిజర్వాయర్‌ను టూరిజం శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. పాలేరులో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం రూ.5కోట్లు కేటాయించిన నేపథ్యాన చేపట్టాల్సిన పనుల వివరాలు ఆరా తీశారు. ఈసందర్భంగా టూరిజం ఎస్‌ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి ఇక్కడి ప్రణాళికలపై వివరించారు. డీడీ రాములునాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ కరుణశ్రీ, డీఈ రామకృష్ణ, ఏడీ నర్సింగ్, కన్సల్టెంట్ ఆర్కిటెక్ హరి తదితరులు పాల్గొన్నారు.

బాణం గురితప్పకుండా..

సీఎం కప్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం



పోటీలో బాణం గురి పెట్టిన క్రీడాకారులు



పాయింట్లను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో భాగంగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆర్చరీ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య, శాట్స్ కోచ్ రవిశంకర్ ప్రారంభించారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో బాలబాలికలు పోటీ పడగా తొలిరోజు ఎలిమినేషన్ రౌండ్ పూర్తయింది. ఇక బుధవారం పోటీల అనంతరం ర్యాంకులు కేటాయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు కృస్టోఫర్‌బాబు, ఎస్.ఏ.ఉప్పల్‌రెడ్డి, పి.రఘునందన్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలుష్యంపై పీసీబీ అధికారి విచారణ

కొణిజర్ల: కొణిజర్ల మండల కేంద్రంలో ఉన్న ఓ రైస్ మిల్లు నుంచి వెలువడుతున్న దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నామని ఎస్సీ కాలనీవాసులు ఇటీవల ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి అజయ్ మిల్లును పరిశీలించడంతో పాటు స్థానికుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన


నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: పలు రాష్ట్రాల్లో విద్యుత్ రంగం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. ఖమ్మంలోని సర్కిల్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసనలో అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణతో బడుగు, బలహీన వర్గాలు, రైతులకు సబ్సిడీ పథకాలు దూరమవుతాయని చెప్పారు. అంతేకాక ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతింటాయని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.ప్రసాద్, రవికుమార్, నారాయణ, మానస, శరత్, పుష్పరాణి, సత్యనారాయణ, ఉష, రాజ్‌కుమార్, కృష్ణారావు, సంధాని పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రంలో విదేశీ పరిశోధకులు


విదేశీ పరిశోధకులతో కన్సల్టెంట్, తదితరులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రాన్ని మంగళవారం విదేశీ పరిశోధకులు సందర్శించారు. న్యూజిలాండ్‌కు చెందిన ప్రొఫెసర్ సారా, ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ జాఫ్రి షా ఇక్కడకు రాగా పురావస్తు పరిశోధకుడు, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి క్షేత్రం చరిత్రను వివరించారు.

చిన్నారి చికిత్సకు చేయూత

వేంసూరు: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి చికిత్సకు మండలంలోని కుంచపర్తి యూత్ బాధ్యులు చేయూతనిచ్చారు. కుంచపర్తికి చెందిన కుక్కపల్లి కృష్ణ కుమారుడు అభినవ్ అనారోగ్యం బారిన పడగా ఖమ్మం ఆస్పత్రికి అక్కడి నుంచి వైద్యుల సూచనలతో హైదరాబాద్ తరలించారు. అయితే, అభినవ్ శస్త్రచికిత్సకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు అవుతుందని చెప్పగా కుంచపర్తి యూత్ ఆధ్వర్యాన సేకరించిన రూ.2.50లక్షలను ఆ కుటుంబానికి మంగళవారం అందజేశారు. అయితే, చిన్నారి కోలుకునే వరకు చికిత్స కోసం మరింత నగదు అవసరమైనందున దాతలు 82973 87528 నంబర్‌కు గూగుల్ పే లేదా ఫోన్ పే ద్వారా పంపించాలని గ్రామస్తులు కోరారు.

మధ్యప్రదేశ్ కూలీ ఆత్మహత్య

కూసుమంచి: మిర్చి తోటల్లో పనికి వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కూలీ మండలంలోని ముత్యాలగూడెంలో మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సెగవాన్ గ్రామానికి చెందిన కుంహియా సింధిలాల్ కుటుంబీకులతో కలిసి ముత్యాలగూడెం పరిసర గ్రామాల్లో మిర్చి కోసేందుకు కొన్నాళ్ల క్రితం వచ్చాడు. సహచర కూలీలతో కలిసి గుడారాలు వేసుకుని ఉంటుండగా, మంగళవారం తెల్లవారుజామున ఆయన గుడారం నుండి బయటకు వెళ్లాడు. ఆతర్వాత రైతులు చేలకు వెళ్తుండగా సింధిలాల్ కిష్టాపురం వెళ్లే రహదారిలో ఎస్సారెస్పీ కాలువ కట్టపై చెట్టుకు ఉరి వేసుకుని కన్పించాడు. దీంతో కుటుంబానికి సమాచారం ఇవ్వగా వారు పరిశీలించేలోగా మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక రుగ్మతలతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని సింధిలాల్ కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్

నేలకొండపల్లి: వివిధ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేయడమే కాక వాటిలో కొన్నింటిని నేరుగా, ఇంకొన్నింటిని భాగాలుగా విప్పదీసి అమ్ముకుంటున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ వివరాలను నేలకొండపల్లిలో కూసుమంచి సీఐ సంజీవ్ వెల్లడించారు. పోలీసులు మంగళవారం ముజ్జుగూడెం క్రాస్ వద్ద తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని విచారించగా నేలకొండపల్లి మండలంలోని బోదులబండకు చెందిన చల్లా నవీన్, దండగల వీరబాబు, నాగేంద్రబాబుగా తేలడమే కాక బైక్‌లు చోరీ చేస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో 9వాహనాలను చోరీ చేసి విక్రయించినట్లు చెప్పగా అందులో ఆరింటిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ముఠాకు సహకరిస్తూ వాహనాలను విక్రయిస్తున్న అల్లి నాగరాజు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి, కూసుమంచి ఎస్సైలు పి.సంతోష్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ బాగుండాలి..

- కొత్త సంవత్సరం అందరికీ కలిసి రావాలి..
- లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారిస్తాం..
- సాక్షి మీడియా, ఎస్‌బీఐటీ ఆధ్వర్యాన డిబేట్‌లో విద్యార్థులు


అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం సహకారనగర్: కాలగర్భంలో కలిసిపోతున్న ఏడాదిలో జరిగిన తప్పొప్పులను సమీక్షించుకుంటూ కోటి ఆశలతో కొత్త సంవత్సరంలో అంతా అడుగు పెడుతున్నారు. ఈసందర్భంగా సాక్షి మీడియా, స్వర్ణభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌బీఐటీ) విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం 'కొత్త సంవత్సరం ఆకాంక్షలు – భవిష్యత్ లక్ష్యాలు' అంశంపై డిబేట్ నిర్వహించగా ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇప్పటికే ఎంచుకున్న లక్ష్యాలను ఈ ఏడాది చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. కొత్త సంవత్సరం చిన్నాపెద్ద తేడా లేకుండా అందరికీ కలిసి రావాలని ఆకాంక్షించారు. తొలుత ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలని తెలిపారు. స్నేహితులు, సహచర విద్యార్థులు కూడా ఉన్నత రంగాల్లో స్థిరపడేలా పరస్పర సహకారం ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపగా కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

మెరుగైన ఫలితాలు...



ఈ కొత్త సంవత్సరంలో అందరూ ఆశించినట్లు మెరుగైన ఫలితాలు రావాలి. గతంలో జరిగిన తప్పొప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తేనే ఇది సాధ్యమవుతుంది. సమాజ అవసరాలను గుర్తిస్తూ తీసుకొని చదువు కొనసాగించాలి.
– సీహెచ్.సంతోష్

కలిసొస్తుందనే నమ్మకం



2024 కూడా బాగానే ఉన్నా 2025 ఇంకా బాగుండాలని కోరుకుంటున్నా. ఈ ఏడాది విదేశాలకు వెళ్లి మెరుగైన విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలనేది నా లక్ష్యం. అందుకోసం ప్రణాళికాయుతంగా నా వంతు ప్రయత్నాలు చేస్తా.
– పి.జయంత్

ఇంకా మెరుగ్గా ఉండాలి...



గడిచిన సంవత్సరంలో మా కళాశాల నుంచి ఎందరో విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ వచ్చాయి. ఈ ఏడాది ఇంకా మరింత మంది ఉద్యోగాలకు ఎంపికవాలి. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచే అందరికీ అద్భుతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా.
– పి.రోజా

ఇప్పటికే రెండు ఉద్యోగాలు



నేను ఇప్పటికే రెండు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యాను. అయినా ఆగకుండా కొత్త సంవత్సరంలో విదేశాలకు వెళ్లి మెరుగైన స్థాయికి చేరాలన్నదే లక్ష్యం. అందుకోసం సమయం వృథా కాకుండా కష్టపడి చదువుతా.
– జి.శ్రీఖ

ఉన్నత అవకాశాలతో...



కొత్త సంవత్సరంలో మంచి అవకాశాలతో ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా. ఇప్పటికే అనేక కంపెనీలు ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్ తరహాలో మరిన్ని కంపెనీలు ఖమ్మం రావాలని కోరుకుంటున్నా.
– పి.అభిలేఖ

అప్‌డేట్ కావాల్సిందే..



పరిస్థితులకు అనుగుణంగా అప్‌డేట్ అయితేనే లక్ష్య సాధన సులువవుతుంది. నేను సీఎస్‌ఈలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎంచుకోగా ఇప్పుడు దానికే డిమాండ్ ఏర్పడింది. తద్వారా అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నా.
– అనుమయ్య

లవ్ మాత్రం చేయొద్దురా...

- స్నేహితులతో చెప్పి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- ఎస్సీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, ఉద్యోగిపై వేటు

మధిర: ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడగా ఆయన చొక్కా జేబులో ప్రేమలేఖ లభించడం, అంతకుముందు స్నేహితులతో 'ఏదైనా చేయండి, లవ్ మాత్రం చేయొద్దురా' అని చెప్పినట్లు తెలుస్తుండడం చర్చనీయాంశంగా మారగా ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఇక పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినట్లు భావిస్తూ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఓ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.... ఏపీ నుంచి 30 ఏళ్ల క్రితం ముదిగొండకు వచ్చిన స్థిరపడిన రాంబాబు అలియాస్ రామారావు – సునీత దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంజన్ల మెకానిక్ అయిన రామారావు తన కుమార్తెను ఖమ్మంలో బీ ఫార్మసీ చదివిస్తుండగా కుమారుడు మాడుగుల సాయివర్ధన్(17) మధిర మండలం కృష్ణాపురం సమీపంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా, ఈనెల 23న క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్లిన సాయివర్ధన్ 30న కళాశాలకు వచ్చినా ముభావంగా ఉంటున్నట్లు తెలిసింది. ఈక్రమాన సోమవారం రాత్రి 10గంటల వరకు సహచరులతో మాట్లాడిన ఆయన చాలామంది విద్యార్థులు ఇంకా రాకపోవడంతో అంతా కలిసి గ్రౌండ్ ఫ్లోర్‌లో నిద్రిస్తామని చెప్పి తీసుకొచ్చాడని తెలిసింది. ఆపై, మొదటి అంతస్తులో లైట్ వెలగనందున నిచ్చెన తీసుకెళ్దామని చెప్పగా స్నేహితులు వద్దని వారించారు. అనంతరం అందరితో కలిసి పడుకున్న సాయివర్ధన్ కాసేపటికి మొదటి అంతస్తులోకి వెళ్లి అక్కడ ఉన్న గేట్‌కు తాళం వేశాక ఉన్న ట్రంకు పెట్టెలను ఒకదానిపై ఒకటి పెట్టి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం ఆయన లేకపోవడంతో స్నేహితులు లెక్చరర్ జవ్వాజి నరేష్‌బాబుకు చెప్పగా ఆయన పైఅంతస్తు గేటు తాళం పగలగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. దీంతో ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు పోలీసులకు తెలపడంతో పోలీసులు, వాచ్‌మెన్, అధ్యాపకులు కలిసి ఆయనను కిందకు దింపేసరికి మృతి చెందినట్లు తేలింది. కాగా, విద్యార్థి జేబులో ఉన్న లేఖను పరిశీలించగా ప్రేమలో విఫలమైనట్లు తెలుస్తోందని వైరా ఏసీపీ రెహమాన్ వెల్లడించినా, పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.


విలపిస్తున్న సాయివర్ధన్ తల్లి సునీత


ప్రిన్సిపాల్ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బాధ్యులపై చర్యలు

కళాశాలకు చేరుకున్న ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, గురుకులాల జోనల్ ఆఫీసర్ కె.స్వరూపరాణి వివరాలు ఆరా తీశారు. అప్పటికే వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఆందోళన చేస్తుండడంతో ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వగా వారు శాంతించారు. ఆతర్వాత ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హౌస్ మాస్టర్ మోషేను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించగా, విద్యార్థి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి తెలిపారు.

ముదిగొండలో విషాదం

ముదిగొండ: ముదిగొండకు చెందిన మాడుగుల సాయివర్ధన్ ఆత్మహత్యతో స్థానికంగా విషాదం నెలకొంది. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వచ్చిన ఆయన అందరితో సంతోషంగా గడపగా, బలవన్మరణానికి పాల్పడినట్లు తెలియడంతో స్నేహితులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

కక్షపూరిత రాజకీయాలు సరికాదు..


శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధు, సండ్ర

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి: ప్రజాపాలన చేస్తున్నామని చెబుతూ కక్షా రాజకీయాలకు పాల్పడడం సరికాదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కనుమతరెడ్డి శ్రీనివాసరెడ్డి పురుగుల మందు తాగగా ఖమ్మంలోని ఆస్పత్రిలో మంగళవారం పరామర్శించి మాట్లాడారు. ఆయన సొంత స్థలంలో కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించాడని తెలిపారు. అంతేకాక బాధితుడిని ఆస్పత్రికి తరలించే సమయాన ఆయన భార్యను మూడు గంటల పాటు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారన్నారు. ఈమేరకు కారకులతో పాటు శ్రీనివాసరెడ్డి భార్యను నిర్బంధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్‌ను కోరారు. ఈకార్యక్రమంలో గోపాలరెడ్డి పాల్గొన్నారు.

సుబాబుల్ తోటలో అస్థిపంజరం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బాలపేట సమీపంలోని ఓ సుబాబుల్ తోటలో మంగళవారం అస్థిపంజరాన్ని గుర్తించారు. రైతు మధు సాగు చేస్తున్న తోటలో సుబాబుల్ చెట్లు నరుకుతుండగా అస్థిపంజరం వెలుగు చూసింది. దీంతో పోలీసులు చేరుకుని అస్థిపంజరం మహిళదని ప్రాథమికంగా గుర్తించారు. ఆ ప్రాంతంలో వస్త్రం, చెప్పులు, మద్యం సీసాలు, గాజులు లభించాయని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఓ కాలి ఎముకకు స్టీల్ రాడ్ వేసి ఉండగా, ఏడాది క్రితమే మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఆమెది సహజ మరణమా, ఇతర కారణాలు ఉన్నాయా అనేది పరీక్షల్లో తేలుతుందని చెబుతున్నారు. కాగా, అస్థిపంజరం లభించిన విషయం చర్చనీయాంశంగా మారగా, అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టెంట్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం

రూ.1.50కోట్ల మేర ఆస్తినష్టం


టెంట్‌హౌస్‌లో ఎగిసిపడుతున్న మంటలు


రోదిస్తున్న యజమాని శ్రీనివాస్

ఖమ్మంక్రైం: అంతా నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమవుతుండగా ఓ కుటుంబం మాత్రం అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయి రోడ్డున పడింది. ఖమ్మంలో సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన జె.శ్రీనివాస్ 20ఏళ్లుగా ముస్తఫానగర్‌లో రాజరాజేశ్వరి పేరుతో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాప్ మూసేసి దగ్గరలోని ఇంటికి వెళ్లాడు. కాగా, టెంట్ హౌస్ సమీపాన నివాసముంటున్న వ్యక్తులు అర్ధరాత్రి దాటాక శ్రీనివాస్‌కు ఫోన్ చేసి టెంట్ హౌస్‌లో నుండి పొగలు వస్తున్నాయని చెప్పగా వచ్చి షట్టర్ తెరిచేసరికి మంటలు చెలరేగాయి. ఈమేరకు అగ్నిమాపక శాఖ అధికారి అజయ్, ఖమ్మం ఫైర్ అధికారి నాగరాజు నేతృత్వాన సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడం, చుట్టుపక్కల షాపులు, జనావాసాలు ఉండడంతో విద్యుత్ సరఫరా ఆపేయించారు. ఆతర్వాత మరో అగ్నిమాపక యంత్రాన్ని రప్పించడంతో మంగళవారం ఉదయం 10గంటలకల్లా మంటలు అదుపులోకి వచ్చాయి. అయితే, ఈ ఘటనతో చుట్టుపక్కల ప్రజలు ఆందోళనకు గురైనా మంటలు వ్యాపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, టెంట్‌హౌస్ నిర్వహించే శ్రీనివాస్ త్వరలో మేడారం మినీ జాతర ఉండడంతో ఆర్డర్ల మేరకు టెంటు, ఇతర సామగ్రి సమకూర్చుకున్నాడు. ఇప్పుడు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా రూ.1.50కోట్ల మేర ఆస్తినష్టం జరగడంతో ఆయనతో పాటు కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తికి చెందిన విద్యార్థి కె.భార్గవ్(17) ఎలుకల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. చింతగుర్తికి చెందిన రాజేష్ పెద్ద కుమారుడు భార్గవ్ పాల్వంచలోని ఎస్సీ గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వచ్చిన ఆయన తిరిగి వెళ్లడానికి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో 27వ తేదీన ఎలుకల మందు తాగిన భార్గవ్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.